


# చాణక్య నీతి

**రావు కృష్ణారావు**

**"తొమ్మిదవుతోంది... వస్తారంటావా?" ఆదుర్దానణచుకోలేక అడిగాడు సురేంద్ర. "తప్పకుండా వస్తారు. అంత కంగారుపడతావేంటి? ఆయనేం సాదాసీదా ఉద్యోగి కాదు సూపరింటెండెంట్ ఇంజనీరు చాలా పన్లుంటాయి. అదీకాక ఈయనో పెద్ద వ్యవహారవేత్తని నువ్వే చెప్పావుకదా!... అందాక ఈ మేగజైన్ చూడు" అని మళ్ళీ తన పుస్తకంలో లీనమయ్యాడు ప్రతాప్.**

వీడొహడు... పుస్తకాల పురుగు. ఇపుడా పుస్తకం చదవకపోతే కొంప మునిగిపోతుందా!... ఆయనెప్పటికొస్తాడో... అసలు వస్తాడా... వచ్చినా పనికొచ్చే సలహా ఇస్తాడా?... ఏమో! తనెళ్ళి కలిసినపుడు మాత్రం 'నీకేం సాయంకావాలో చెప్పు' అని దొంగ నవ్వు నవ్వాడు. నాకేంకావాలో తనకి తెలియదా? అపర చాణుక్యుడని పేరు. అసలు వీళ్ళందర్నీ నమ్ముకోవడం మంచిదికాదేమో! వాడు... ఆ దొంగ వెధవ! ఎమ్మెల్యేగాడు 'నన్నేం చెయ్యమంటావో చెప్పు అంతేగాని నీ బిజినెస్ ప్రాబ్లమ్సన్నీ నాకు చెప్పకు. నా తలనొప్పులు నాకున్నాయి' అని విసుక్కున్నాడు. వాడికి తనెంత సాయం చేశాడు. డొనేషన్లిచ్చాడు. ఎప్పుడడిగినా మీటింగులకి కార్లు, లారీలు సప్లైచేశాడు. 'ఆ ఎమ్మెల్యేగాడు దొంగవెధవ' అంటే ఈ ప్రతాప్‌గా డొప్పుకోవడంలేదు. 'నువ్వడిగింది చెయ్యనంటే కదా!' అంటున్నాడు. ఏవిటో... ఏం అర్థంకావడం లేదు. అయిదేళ్ళ నుండి ఫీల్డ్‌లో ఉన్న తనకే ఆ సుబ్బయ్యగాడికిటుకు తెలిసి చావడంలేదు. ఇక ఆ ఎమ్మెల్యేకేమర్థమవుతుంది? అయినా వాడెలా చెయ్యగలుగుతున్నాడు...క్వాలిటీ ఎంత తగ్గించినా ఆ రేట్లకు చెయ్యడం అసాధ్యం. 8శాతం లెస్‌చేస్తే కొంచెం నష్టంతో బయటపడగలమన్నాడు వేణు. అతని అంచనాలు తప్పవెప్పుడూ!... మరి వాడెలా... ఛ... ఇందులో దిగి తప్పు చేశానేమో! 'అన్నిటికంటే ఎడ్యుకేషన్ బిజినెస్సే బాగుంది కాలేజీ పెట్టుకో' అని తండ్రి చెప్పిన మాట వినుంటే బాగుండేదేమో! ఇప్పటివరకూ మేజర్ వర్క్‌గాని, చెప్పుకోదగ్గ లాభంగాని లేదు. ఆ గాడిదకొడుకు రానిస్తే కదా! అందుకే ఈసారి ఎలాగైనా ఈ ప్రెస్టీజియస్ వర్క్ సంపాదించాలని వేణు వద్దన్నా వినకుండా 10 శాతం లెస్‌కు టెండరు వేశాడు. ఆ సుబ్బయ్యగాడు ఏకంగా 12 శాతం లెస్‌కు టెండరు వేసి కొట్టేశాడు. దొంగనోట్లతోగాని చేయిస్తున్నాడా? ఎంత ఆలోచించినా, బుర్రబద్దలు కొట్టుకున్నా అర్థంకావడంలేదు. ఎస్.ఇ.కి తెలుస్తుందా? తెలిసినా చెబుతాడా?... చెబుతాడని ప్రతాప్‌గాడి నమ్మకం. వాడి సలహా మీదే పార్టీ ఏర్పాటుచేశాడు. వాడే వెళ్ళి ఎస్.ఇ.ని పిలిచాడు. అన్నీ సిద్ధంగా ఉన్నాయి. ఇంకేమైనా కావాలంటాడా? అసలే ఈ గెస్ట్‌హవుజ్ ఊరవతలుంది. ఎవరికీ తెలియకూడదని బాయిస్‌నెవర్నీ ఉంచలేదు. ఏమైనా కావలిస్తే తనే వెళ్లాలి. ఏంచేస్తాం! ఇంతకీ అసలాయన రాడేం?...

ప్రతాప్ వంక చూశాడు సురేంద్ర. చాలా ఏకాగ్రతతో చదువుతున్నాడు. ఏమిటో వీడి పుస్తకాల పిచ్చి. అవంటే తనకెలర్జీ. వాడితో బంధుత్వమున్నా స్నేహమే ముఖ్యం. తనంటే ప్రాణమిస్తాడు. చూసిపోదామని వచ్చినవాడు తన పరిస్థితి చూసి తిరుగుప్రయాణం వాయిదావేసుకున్నాడు. పూర్తిగా ఢీలాపడిపోయిన తనకు ధైర్యం చెప్పాడు. వీడి పుణ్యమాని తనకోదారి దొరికితే బాగుణ్ణు. ఎస్.ఇ. వీడికి బంధువు. బాగా చనువుంది. సురేంద్ర ఇలా ఆలోచిస్తుండగా కారొస్తున్న శబ్దమయింది.

"ఒరేయ్... ఎస్.ఇ. గారొచ్చినట్టున్నారు" పిలిచాడు సురేంద్ర.

ఇద్దరూ బయటకు వచ్చారు. ఎస్.ఇ. తాను దిగి కారుని వెనక్కు పంపేశాడు.

"వెల్‌కమ్ సర్!" అంటూ సురేంద్ర, "రండంకుల్" అంటూ ప్రతాప్ ఆహ్వానిస్తుండగా చిరునవ్వుతో లోపలికొచ్చిన ఎస్.ఇ. "భారీ ఏర్పాట్లు చేసినట్లున్నారు" అంటూ పరిశీలనగా చూడసాగాడు.

స్కాచ్ విస్కీ, సోడాలు, ఐస్‌క్యూబ్స్‌తో నిండిన ఫ్లాస్క్, గ్లాసులు, జీడిపప్పు, అరటిపళ్ళూ, ద్రాక్షపళ్ళూ టీపాయ్ మీదున్నాయి. డైనింగ్ టేబిలు మీద హాట్‌పాక్‌లున్నాయి. అన్నీ పరిశీలించిన ఎస్.ఇ. "ప్రతాప్... విస్కీకి కాంబినేషన్ యాపిల్స్" అన్నాడు నవ్వుతూ!

"సారీ అంకుల్! మాకు తెలియదు. ఇపుడే తెస్తాను"

"వద్దు! ఇవి చాలు. నువ్వు తెలుసుకుంటావని చెప్పానంతే!"

వద్దంటున్నా వినకుండా తన కారు తీసి బయలుదేరాడు సురేంద్ర. అతను యాపిల్స్‌తో తిరిగివచ్చేసరికి ఎస్.ఇ. కొంచెం కొంచెం తాగుతూ ఏవో కబుర్లు చెబుతున్నాడు. ప్రతాప్ బీర్ మగ్ చేత్తో పట్టుకొని ఆసక్తిగా వింటున్నాడు. సురేంద్ర కూడా ప్రతాప్ పక్కనే కూర్చుని వినసాగాడు. కొంతసేపట్లోనే అతనికి విసుగు మొదలయ్యింది. మరికొంతసేపటికి ఎస్.ఇ. బాత్‌రూమ్‌కెళ్ళాక లోగొంతుకతో, కోపంగా "సుత్తంతా మాట్లాడతావేంటి?"అన్నాడు.

"ఇంకా తాగిం తర్వాతగాని కదపకూడదురా ఫూల్! కొంచెం ఓపికపట్టు" అన్నాడు ప్రతాప్!

"ఏవోయ్! నువ్వేమీ తీసుకోవా?" బాత్‌రూమ్ నుండి వస్తూనే అడిగాడు ఎస్.ఇ.

"లేద్సార్! నేనిది తాగుతాను" అంటూ థమ్సప్ గ్లాసులో పోసుకున్నాడు సురేంద్ర.

మళ్ళీ కబుర్లు మొదలెట్టాడు ఎస్.ఇ. సినిమాలు మొదలుకొని, పుస్తకాలు, వంటలు వరకూ అన్నీ మాట్లాడుతున్నాడు. ఆసక్తిగా వింటూ మధ్యలో తనూ మాట్లాడుతున్నాడు ప్రతాప్. సురేంద్రకు మాత్రం చాలా విసుగ్గా వుంది. నెమ్మదిగా తాగినా చాలా తాగాడు ఎస్.ఇ. అయినా మాట తడబడటంలేదు. మొహం మాత్రం కొంచెం మొద్దుబారింది. అంతే!

"మీకు లేటయిపోతోంది భోంచేసేద్దాం"అన్నాడు ఎస్.ఇ.

"ఫరవాలేద్సార్! మీరు కానివ్వండి" అన్నాడు సురేంద్ర.

"నేను భోజనం అయింతర్వాత కూడా తీసుకుంటాను ముందు భోంచేసేద్దాం!"

డైనింగ్ టేబిల్ దగ్గర భోజనాలు ప్రారంభించారు. తింటూ కూడా వంటల గురించి మాట్లాడసాగాడు ఎస్.ఇ. రకరకాల వంటకాలు. వాటి తేడాలు, ప్రాంతాలవారీ రుచులూ, వాటిని వండే

పద్ధతి గురించి చెబుతుంటే మిత్రులిద్దరూ ఆశ్చర్యపోయారు. భోజనం చాలాసేపు పట్టింది. ముగిసింతర్వాత మూతి తుడుచుకుంటూ "థాంక్స్ సురేంద్రా! మంచి పార్టీ ఏర్పాటుచేశావు" అన్నాడు ఎస్.ఇ.

"తనే ఎరేంజ్ చేశానని గ్రహించాడన్నమాట" అనుకుంటూ వినయంగా నవ్వి ఊరుకున్నాడు సురేంద్ర.

"మీ సలహా అడగడానికి మావాడు మొహమాటపడుతున్నాడంకుల్! ఈ బిజినెస్‌లో కంటిన్యూ అవ్వాలా వద్దా అని తేల్చుకోలేకపోతున్నాడు" నెమ్మదిగా చెప్పాడు ప్రతాప్!

ఎస్.ఇ. మొహం క్షణంపాటు మరింత మొద్దుబారి వెంటనే మామూలయ్యింది. గొంతు సవరించుకొని, "సురేంద్రా నేను నీకిచ్చే మొదటి సలహా ఏమిటంటే ముందు ఓర్మి అలవర్చుకో... చిన్నవాడివి... ఏమీ అనుకోవనే నమ్మకంతో చెబుతున్నా! నీకస్సలు ఓర్పులేదు. ప్రతాప్ చూడు తనకిష్టమున్నా లేకపోయినా నా కబుర్లు ఎంతో ఆసక్తిగా విన్నాడు. నీమొహం మీద విసుగు స్పష్టంగా కనిపించింది. విసుగు కార్యసాధనకు, తెలివితేటలకు శత్రువు. నీకా విసుగు లేకుంటే నాకు ఈ విస్కీ కంటే కూడా కబుర్లు చెప్పడమే ఇష్టమనే విషయం గ్రహించగలిగేవాడివి" అన్నాడు.

'సారీ సర్... నేనేదో టెన్షన్‌లో..." నసిగాడు సురేంద్ర.

ఫ్రాంక్‌గా మాట్లాడుకుందాం... టెన్షనెందుకు?" అడిగాడు ఎస్.ఇ.

ఎంత ప్రయత్నించినా నాకు మంచి వర్క్ ఒక్కటీ రావడంలేదు. ఆ సుబ్బయ్యగాడు... అంటూ ఏదో చెప్పబోయాడు సురేంద్ర.

"నో... నీ శత్రువైనా నీకంటే తెలివైనవాడిని గౌరవించడం నేర్చుకో! అన్నివిధాల నీకంటె పెద్దవాడాయన! ఆయన్నుండి నువ్వు నేర్చుకోవలసింది చాలావుంది" సీరియస్‌గా చెప్పాడు ఎస్.ఇ.

"సారీ సర్!"

"12 శాతం లెస్‌కు సుబ్బయ్యగారు వర్క్స్ ఎలా చెయ్యగలుగుతున్నారంకుల్?" అడిగాడు ప్రతాప్.

"అదో చిదంబర రహస్యం. ఆరేటుకి చేస్తే దేవుడికైనా నష్టంవస్తుంది" నవ్వుతూ చెప్పాడు ఎస్.ఇ.

"మరెలా?" ఇద్దరూ ఒకేసారడిగారు.

"సుబ్బయ్య ఒక్క పనిచేసి మూడు పేమెంట్లు తీసుకుంటాడు" నవ్వుతూనే చెప్పాడు ఎస్.ఇ.

**మళ్ళీ కబుర్లు మొదలెట్టాడు ఎస్.ఇ. సినిమాలు మొదలుకొని, పుస్తకాలు, వంటలు వరకూ అన్నీ మాట్లాడుతున్నాడు. ఆసక్తిగా వింటూ మధ్యలో తనూ మాట్లాడుతున్నాడు ప్రతాప్. సురేంద్రకు మాత్రం చాలా విసుగ్గా వుంది. నెమ్మదిగా తాగినా చాలా తాగాడు ఎస్.ఇ. అయినా మాట తడబడటంలేదు. మొహం మాత్రం కొంచెం మొద్దుబారింది. అంతే!**

"అదెలా?" మళ్ళీ ఇద్దరూ ఒకేసారడిగారు.

"మేం చాలా జాగ్రత్తగా కొన్ని టెక్నికల్ మిస్టేక్స్ చేస్తాం. సపోజ్... ఈ వర్కే తీసుకో! ప్రహరీగోడ చాలా పొడవయినది. రెండు దిక్కులా అంటే తూర్పు, ఉత్తరం మా స్థలం ఆరంగుళాలు వదిలేసి, మరో రెండు వైపులు పడమర, దక్షిణం దిక్కుల్లో మున్సిపాలిటీ స్థలంలోకి కట్టేస్తాం. మున్సిపాలిటీ నోటీసు ఇస్తుంది. మొత్తం గోడ పడగొట్టి అపుడు సరిగా కడతాం! కట్టడం, పడగొట్టడం, మళ్ళీ కట్టడం మొత్తం మూడుపేమెంట్లు" నవ్వుతూ చెప్పాడు ఎస్.ఇ.

"అందులో మాత్రం ఎలా మిగులుతుంది?" అడిగాడు సురేంద్ర.

"పిచ్చివాడా... మొదటిసారి కట్టడం. పడగొట్టడం అంతా పేవరు మీదే! చాలా గుంభనంగా జరుగుతుంది. మా డిపార్ట్‌మెంట్‌లో కూడా అందరికీ తెలియదు. దీనికి మున్సిపాలిటీ నుండి, ఆడిట్ డిపార్ట్‌మెంట్ వరకూ చాలామంది సహకారం కావాలి. ఎర్త్ వర్క్, లోడ్‌వర్క్ మొదలగువాటిల్లో బాగా మిగులుతుంది. బిల్డింగ్ పూర్తవుతుండగా మినిష్టరుగారు విజిట్ చేస్తారు. ఆయనతో వాస్తుబ్రహ్మ వస్తాడు. అతనేవో మార్చాలంటాడు. మినిష్టరుగారు వెంటనే మార్చేయమంటారు. అదికూడా చేయిస్తాం! ఇలా చాలాఉంటాయి" చెప్పాడు ఎస్.ఇ.

"వాటికూడా ఎస్.ఎస్.ఆర్. ప్రకారమే కదా పే చేసేది. ఎక్కువెలా మిగులుతుంది?" అడిగాడు సురేంద్ర.

"రేట్లు ఎస్సెస్సార్ ప్రకారమే. మెజర్‌మెంట్స్ ఎక్కువ చూపిస్తాం" చెప్పాడు ఎస్.ఇ.

"అంటే?" అడిగాడు ప్రతాప్.

"ఎర్త్ ఫిల్లింగ్ ఉందనుకో అడుగుచేసి రెండడుగులు చేసినట్లు చూపిస్తాం. ఇలాంటి మార్గాలు చాలా ఉన్నాయి. అన్ని అయింతర్వాత డిపార్ట్‌మెంటు వివిధ దశల్లో ఆలస్యం చేసినందువల్ల నష్టపోయానంటూ ఆర్బిట్రేషనుకెళ్తాడు సుబ్బయ్య. అందులో కూడా అతనే నెగ్గుతాడు. వీటన్నిటికి చాలా పలుకుబడి, డబ్బు, తెలివితేటలూ, ఓర్పూ అవసరం. ఈ మొత్తం వ్యవహారంలో చాలామంది ప్రమేయముంటుంది. చిన్న పొరపాటు జరిగినా, ఏ ఒక్కరు సాయపడకపోయినా నష్టం వస్తుంది" చెప్పాడు ఎస్.ఇ.

"అంత తక్కువకి టెండరేయడమెందుకు? ఇన్ని పాట్లెందుకు?" అడిగాడు సురేంద్ర.

"టెండరు తక్కువవేసేది నిన్నీ బిజినెస్ నుండి బయటకు పంపేయడానికి. మిగతా పాట్లన్నీ తన లాభంకోసం. నీకీ వర్క్‌రాలేదు. నువ్వురెచ్చిపోయి తర్వాతిది ఏ 13 శాతం లెస్‌కో వేశావనుకో నిండా మునిగిపోతావు. అప్పుడింక అతనితో పోటీ పడలేవు. అందుకే ఈ బిజినెస్‌లో సుబ్బయ్యలాంటి



కొద్దిమంది తప్ప మిగతా వాళ్ళు నిలబడలేకపోతున్నారు" చిరునవ్వుతూ చెప్పాడు ఎస్.ఐ.

"మీరివన్నీ నాకెప్పుడూ చెప్పలేదూ..." మాడిపోయిన మొహంతో నిష్ఠూరంగా అన్నాడు సురేంద్ర.

"నీకెందుకు చెప్పాలి?... రెచ్చగొట్టేలా నవ్వుతూ అన్నాడు ఎస్.ఐ.

"మీరూ, ఎమ్మెల్యేగారూ, మంత్రిగారూ, అంతా మనవాళ్ళనే ధైర్యంతోనే ఉన్నానిన్నాళ్ళూ. మీరేమో మన శత్రువుకు సాయం చేస్తున్నారు" జేవురించిన మొహంతో కోపంగా అన్నాడు సురేంద్ర. అతని ముక్కుపుటాలు స్వల్పంగాఅదురుతున్నాయి. శ్వాస వేగం పెరిగింది.

"ఒరేయ్!.. అంటూ వారించబోయాడు ప్రతాప్.

"అతన్ని మాట్లాడనీ..." అని ప్రతాప్‌తో అని సురేంద్రనుద్దేశించి " 'మనవాళ్ళు', 'మన శత్రువు' అంటున్నావు. అది నీ అమాయకత్వం. కులం ఒక మేరకే. అంతకంటే ముఖ్యమైనది స్వప్రయోజనం. నావాడనుకొని నీకు సాయం చేయవలసి వస్తే నిస్సహాయులూ, కూటికి లేనివాళ్ళూ మన కులంలో చాలామందున్నారు. అలాంటి వాళ్ళకు కాక నీలాంటి వాళ్ళకు సాయపడితే కులాన్నుద్ధరించినట్లవుతుందా?" నవ్వుతూనే అడిగాడు ఎస్.ఐ.

"మనమంతా ఐకమత్యంతో ఉండాలని మీరు మన సంఘం మీటింగుల్లో ఇచ్చే ఉపన్యాసాలెందుకు?" సురేంద్ర స్వరంలో ఇంకా కోపం ధ్వనిస్తోంది.

సురేంద్ర కోపం గ్రహించినట్లే, నవ్వుతూనే "ఆ ఉపన్యాసాలు బుద్ధిలేనివాళ్ళకోసం. కులం మనకుపయోగపడాలి. కొంతవరకూ రక్షణిస్తుంది. అధికారం పొందడానికదో చిన్నమెట్టు. అంతే!... అదే సర్వస్వమనుకుంటే ఎందుకూ పనికిరాకుండా పోతాం" అన్నాడు ఎస్.ఐ.

సురేంద్ర బదులివ్వలేదు. మొహం ముడుచుకునే ఉన్నాడింకా!

"నీకు నా మాటలు నచ్చడంలేదు కదూ! గీత ఏం చెప్పింది? తామరాకుమీద నీటిబొట్టులా జీవించమంది. అలాగే తెలివైనవాళ్ళం 'కులం'లోనే బతకాలిగాని అది మనకు అంటకూడదు" వంకరగా నవ్వుతూ చెప్పాడు ఎస్.ఐ. ఆ నవ్వు భయంకరంగా ఉందనిపించింది ప్రతాప్‌కు.

"అదెలా కుదురుతుంది?" సురేంద్ర స్వరంలో తీవ్రత తగ్గిందీసారి.

"జరుగుతున్నదదే! ఓ మాట అడుగుతాను ఏమీ అనుకోవు కదూ!" అడిగాడు ఎస్.ఐ.

"అడగండి" అన్నాడు సురేంద్ర.

"నువ్వు 'వేణు'నే ఎందుకు తీసుకున్నావు? మన కులం కుర్రాళ్ళు ఇంజనీర్లు చాలామందున్నారుకదా! నీ మెటీరియల్ సప్లయిర్ మన కులంవాడా? మన వాళ్ళ దగ్గరే కొనొచ్చుకదా! సుబ్బయ్య మనకు శత్రువన్నావు. కాని అతనికి మెటీరియల్ సప్లై చేసేది మన కులంవాడే! మన కులపు కుర్రాడు నీ దగ్గర ఆఫీసుబాయ్‌గా చేరతానని వస్తే ఏమన్నావు? 'స్వంత కులం వాడయితే మొహమాటంగా ఉంటుంది వద్దు!' అన్నావు. ఇక నీవు మినిష్టరుకు, ఎమ్మెల్యేకు ఇచ్చిన ఫండ్స్ కులాభిమానంతో ఇచ్చావా? లేక వారు నీకు సాయపడాలనా? నీకు లేని కులాభిమానం మమ్మల్నందర్నీ చూపించమంటున్నావా?" వ్యంగ్యంగా నవ్వుతూ అడిగాడు ఎస్.ఐ.

సురేంద్ర మొహం వెలవెలబోయింది. ఏంచెప్పాలో తెలియక "సారీ..." అన్నాడు.

"నువ్వు చేసింది తప్పు అనడంలేదు. మనవాడని అసమర్థుడ్ని ఇంజనీరుగా పెట్టుకుంటే మునిగిపోతావు. వేణు సమర్థతే నీకు కావాలి. అతని కులం కాదు" అన్నాడు ఎస్.ఐ.

"నేనింత లోతుగా ఆలోచించలేదు..." ఓడిన వాడి మాటల్లా ఉన్నాయి సురేంద్ర పలుకులు.

"అంకుల్... ఇలాంటి విషయాలు మనవాళ్ళకు చెబితే కొంత కులపిచ్చి తగ్గుతుందికదా! ఆ పిచ్చితో చాలమంది నష్టపోతున్నారు" అడిగాడు ప్రతాప్.

"అదే అమాయకత్వం. వాళ్ళందరిలో ఏ పిచ్చీ

**"నీకు నా మాటలు నచ్చడంలేదు కదూ! గీత ఏం చెప్పింది? తామరాకుమీద నీటిబొట్టులా జీవించమంది. అలాగే తెలివైనవాళ్ళం 'కులం'లోనే బతకాలిగాని అది మనకు అంటకూడదు" వంకరగా నవ్వుతూ చెప్పాడు ఎస్.ఐ. ఆ నవ్వు భయంకరంగా ఉందనిపించింది ప్రతాప్‌కు.**



లేకపోతే మనకు ప్రమాదం. ఈ దేశాన్నింకా చాణక్యనీతే నడిపిస్తున్నది" కామ్‌గా చెప్పాడు ఎస్.ఐ.

"ఇంతకీ ఆయనేం చెప్పాడంకుల్?" అడిగాడు ప్రతాప్.

"రాజు ప్రజల్లో అన్నిరకాల మూఢనమ్మకాలను వ్యాపింపచెయ్యాలి. తను మాత్రం ఎటువంటి మూఢనమ్మకాలకూ లోనవగూడదు అని చెప్పాడు" మళ్ళీ వంకరనవ్వుతో ఎస్.ఐ.

"దారుణం...అంటూ ఆలోచనలో మునిగిపోయాడు ప్రతాప్. ఎస్.ఐ. కూడా కిటికీలోంచి చీకట్లోకి చూస్తూ దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. చాలసేపు ఎవరూ మాట్లాడలేదు. తెలవారిపోయేలా ఉంది అని ప్రతాప్‌ను పొడిచి సైగచేశాడు సురేంద్ర.

"ఇంతకీ మావాడినేం చెయ్యమంటారు?" అడిగాడు ప్రతాప్.

ఎస్.ఐ. ఉలిక్కిపడి, తలవిదిలించి మామూలుగా నవ్వడానికి ప్రయత్నించాడు. అయితే ఆ నవ్వుకి ఎపుడూ ఉండే అందం లేదు. "ఇక్కడ కాంట్రాక్టర్స్ చాలామందున్నా, సుబ్బయ్యతో పోటీపడగలవాళ్ళు నువ్వూ అనంతవర్మ మాత్రమే. వర్మ ఆల్‌రెడీ సుబ్బయ్యతో రాజీపడ్డాడు. ఇక నువ్వు మిగిలావు ఆలోచించుకో".

"వర్మ సుబ్బయ్యతో రాజీపడ్డాడా? నమ్మలేకపోతున్నాను" ఆశ్చర్యం నిండిన గొంతుతో అన్నాడు సురేంద్ర.

"చాలాకాలమయింది. రాజీచేసింది కూడా నేనే. అప్పట్నుంచీ వర్మకు వర్క్స్ అలాటవుతున్నాయి. నీ పోటీ వల్ల వాళ్ళిద్దరికీ కూడా ఇబ్బందిగా ఉంది" చెప్పాడు ఎస్.ఐ.

"మరి ఆ గాడిదకొడుకు ఇప్పటికీ నాదగ్గర సుబ్బయ్యగార్ని తిడతాడు!" కోపంగా అన్నాడు సురేంద్ర.

"అదే వద్దన్నాను. ఆలోచనపెంచుకో. రేపు నువ్వు రాజీపడినా అలాగే ఉండాలి. లేకపోతే దొంగలు ఊళ్ళు పంచుకుంటున్నారని జనానికర్థమయిపోదూ!" మందలింపు స్వరంతో అన్నాడు ఎస్.ఐ.

సురేంద్ర మౌనంగా ఉండిపోయాడు.

"నీకు మరో విషయం చెబితే ఆశ్చర్యపోతావు. వాళ్ళిద్దరికి రాజీచేయమని చెప్పింది మన మినిష్టరుగారే" తన సహజమైన నవ్వు నవ్వడానికి ప్రయత్నిస్తూ చెప్పాడు ఎస్.ఐ.

సురేంద్ర మొహం మళ్ళీ జేవురించింది. "ఏమయితేనేం మీ అందరికీ ఆ వర్మగాడే ఎక్కువయ్యాడు" ఉడుకుమోత్తనంతో మాట్లాడే పిల్లాడిలా అన్నాడు సురేంద్ర.

"సురేంద్రా... డోంట్‌బీ ఫూలిష్... నీతో మాట్లాడమని చాలాకాలం నుండి నాకు చెబుతున్నాడు సుబ్బయ్య. నువ్వు పరిస్థితినర్థం చేసుకుని నా దగ్గరకొస్తావని వెయిట్ చేశాను. అందుకే పిలవగానే వచ్చాను" అనునయిస్తున్నట్లుగా చెప్పాడు ఎస్.ఐ.

"సుబ్బయ్యగార్ని నమ్మవచ్చా? మనవాడసలే అమాయకుడు?" అడిగాడు ప్రతాప్.

"అస్సలు నమ్మకూడదు. అతను రాజీపడేది నీకోసం కాదు. నీతో పోటీపడేకంటే నీకో 25 శాతం, వర్మకో 25 శాతం వర్క్స్ వదిలేస్తేనే లాభం. అవకాశం వస్తే నిన్ను ముంచేయడానికి వెనుకాడడు. నువ్వూ అవకాశం ఇవ్వకూడదు. నువ్వీ రాజీకొప్పుకోకపోతే 'వేణు'ని నీ దగ్గర నుండి లాగేయడానికి ప్రయత్నిస్తాడు. అయితే నేను సర్వీసులో ఉండగా సుబ్బయ్య నీకపకారం చెయ్యడు. ఈలోపు నీ శక్తి సామర్థ్యాలను పెంచుకుంటే మంచి భవిష్యత్తుంటుంది" చెప్పాడు ఎస్.ఐ.

ఎస్.ఐ. చెప్పిన చివరి మాటలు సురేంద్రను బ్రహ్మానందభరితుడ్ని చేశాయి.

"తెలియక ఏదో అనుకున్నాను... మీరింత మంచివారనుకోలేదు..." అంటూ ఏదో చెప్పబోయాడు సురేంద్ర.

"మళ్ళీ పొరబడుతున్నావ్! నీకేదో ఫేవర్ చెయ్యగానే మంచివాడ్నయిపోతానా? మంచిగా ఉంటే నేనీ స్థితిలో ఉండను. మంచితనం, న్యాయం, ధర్మం, చట్టం మొదలైనవన్నీ సామాన్యులకోసమే. మనం వాటిని వల్లించేది వాళ్ళను మభ్యపరచడానికే. మనం వాటికి కట్టుబడి ఉన్నట్టు నటిస్తాం. చిల్లరమల్లర విషయాల్లో కట్టుబడి ఉంటాం కూడా! ఎందుకంటే జనం వాటికి కట్టుబడి ఉండకపోతే మనమే ఎక్కువ నష్టపోతాం. చిల్లర మల్లర విషయాల్లో మంచిగా ఉండటమే మనకు లాభం" చెప్పాడు ఎస్.ఐ.

"థేంక్యూ సర్... థేంక్యూ వెరీమచ్" అన్నాడు సురేంద్ర.

"చూడూ... ఈరోజుల్లో కూడా బలమున్నవాడిదే రాజ్యం. ఇపుడు బలం అంటే తెలివితేటలు, డబ్బు, రాజకీయం. అసమర్థుడ్ని బతకనివ్వరు. అందుకే ఓ కవి 'పులినెవ్వరు బలి ఇవ్వరు–మేకనైతే బతకనివ్వరు' అన్నాడు. అది అక్షరసత్యం" గంభీరంగా చెప్పాడు ఎస్.ఐ.

జ్ఞానోదయమవుతోందా అన్నట్లు అపుడే తెలవారుతున్న తూరుపు దిక్కులా తేటబారసాగింది సురేంద్ర మొహం. ●